
EVENING EDITION
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శుక్రవారం
06 డిసెంబర్ 2024
పేజీలు: 02



## రేపు తెలంగాణనికి బీజేపీ చీఫ్ జేపీ నడ్డా

బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రేపు హైదరాబాద్ వస్తున్నారు. సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే బహిరంగ సభలో ఆయన పాల్గొంటారు. ఈ మీటింగ్‌లో '6 అబద్ధాలు.. 66 మోసాలు' అన్న నినాదంతో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతారు. ఈ సభకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర ఇన్‌ఛార్జి సునీల్ బన్సల్ కూడా హాజరవుతారు.

## రామ్ పోతినేని #22 ఫస్ట్ లుక్

రామ్ పోతినేని కం బ్యాక్ కోసం ఇపుడు తన ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక ఈ సినిమా తర్వాత తాను తన కెరీర్ 22వ సినిమా దర్శకుడు మహేష్ తో అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. "మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి" తో సాలిడ్ డెబ్యూ అందుకున్న ఈ యువ దర్శకుడు కాంబినేషన్ లో రీసెంట్ గా అనౌన్స్ చేశారు. మరి దీని నుంచి రామ్ పై లేటెస్ట్ గా ఒక సూపర్ కూల్ ఫస్ట్ లుక్ పోస్టర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో రామ్ సాగర్ అనే పాత్రలో నటిస్తుండగా ఒక సైకిల్, దానితో ఒక సింపుల్ లుక్ లో రామ్ జోవియల్ గా కనిపిస్తున్నాడు. మరి ఈ సాగర్ మీలో ఒకడు అంటూ పోస్ట్ చేశారు. మరి ఈ సినిమా ఎలాంటి ఎంటర్టైన్మెంట్ ఇస్తుందో చూడాలి. ఇక ఈ చిత్రానికి మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తుండగా షూటింగ్ పనులు జరుగుతున్నాయి.




## పుష్ప-2కి షాకింగ్ ఓపెనింగ్స్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కి ఇపుడు పాన్ ఇండియా లెవెల్లో ఎలాంటి క్రేజ్ ఉంది అనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. తన లాస్ట్ సినిమా పుష్ప 1 కి నార్త్ మార్కెట్ లో భారీ వసూళ్లు అందుకోగా ఇపుడు పార్ట్ 2 తో అయితే ఏకంగా అక్కడ స్టార్స్ తాలూకా ఆల్ టైం రికార్డ్స్ కి బన్నీ ఎసరు పెట్టాడు. ఎన్నో అంచనాలు నడుమ వచ్చిన పుష్ప 2 ఇపుడు హిందీలో ఉన్న ఆల్ టైం రికార్డ్ బ్రేక్ చేసినట్టుగా తెలుస్తుంది. ఇండియా వైడ్ గా హిందీ నుంచి షారుఖ్ ఖాన్ నటించిన జవాన్ సినిమా 65 కోట్లకి పైగా నెట్ వసూళ్లు అందుకోగా ఇపుడు దీనిని పుష్ప 2 బ్రేక్ చేసినట్లు తెలుస్తోంది. మరి లేటెస్ట్ గా పుష్ప 2 హిందీ వరకే 67 కోట్లకి పైగా నెట్ వసూళ్లు సాధించి ఆల్ టైం రికార్డ్ సెట్ చేసినట్టుగా హిందీ ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీనితో పుష్ప 2 దెబ్బతో నార్త్ మార్కెట్ లో తెలుగు హీరో ఖాతాలో మరో ఆల్ టైం రికార్డ్ పడింది.







## డిగ్రీ, పీజీ విద్యార్థులకు గుడ్ న్యూస్

ఇంటర్ సబ్జెక్టులతో సంబంధం లేకుండా నచ్చిన గ్రూప్‌లో డిగ్రీ చేసే అవకాశం కల్పించేందుకు UGC యోచిస్తోంది. డిగ్రీలో చదివిన కోర్సులతో సంబంధం లేకుండా విద్యార్థులకు పీజీ చేసే వీలు కల్పించనుంది. వర్సిటీ/జాతీయ స్థాయి ఎంట్రన్స్ టెస్టులో పాసైన వారికి ఈ వెసులుబాటును అందుబాటులోకి తేనుంది. నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్‌కు అనుగుణంగా మార్కులు తెచ్చుకున్నవారు నేరుగా డిగ్రీ రెండో, మూడో, నాలుగో ఏడాదిలోనూ చేరొచ్చు.

# వరుసగా 11వ సారి.. వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పూ లేదు

వడ్డీ రేట్ల విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుక్రవారం కీలక ప్రకటన చేసింది. ఈసారి కూడా కీలక వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచుతున్నట్లు స్పష్టం చేసింది. వరుసగా 11వ సారి కూడా రెపో రేటును 6.5 శాతంగానే ఫిక్స్ చేసింది. ఆర్బీఐ ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఇవాళ వెల్లడించారు.రెపో రేటును 6.5 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు ప్రకటించారు. ద్రవ్యోల్బణం, ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ సారి కూడా వడ్డీరేట్లలో మార్పులు చేయకూడదని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. కాగా, 2023 ఫిబ్రవరి నుంచి రెపో రేటును ఇలాగే కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. రెపో రేటులో ఎలాంటి మార్పు చేయకపోవడం వరుసగా ఇది 11వ సారి. ఆర్‌బీఐ ఖరీదైన ఈఎంఐ నుండి ఉపశమనం ఇవ్వలేదు. సెంట్రల్ బ్యాంక్ తన పాలసీ రేటులో అంటే రెపో రేటులో ఎలాంటి మార్పు చేయలేదు. రెపో రేటు 6.50 శాతం వద్ద కొనసాగుతోందని, ఫిబ్రవరి 2023 నుండి రెపో రేటులో ఎటువంటి మార్పు లేదని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రకటించారు. వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పు చేయకపోవడం వరుసగా ఇది 11వసారి. 2023 ఫిబ్రవరి నుంచి కేంద్ర బ్యాంకు ఈ రేటును ఇలాగే కొనసాగిస్తూ వస్తోంది. క్యాష్ రిజర్వ్ రేషియోలో 50 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రకటించారు. CRR – 4.50 శాతం నుండి 4 శాతానికి తగ్గించారు. నగదు నిల్వల నిష్పత్తి తగ్గింపును రెండు దశల్లో అమలు చేయనున్నారు. దీంతో బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.1.16 లక్షల కోట్ల అదనపు నగదు అందుబాటులోకి వస్తుంది. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ మూడు రోజుల సమావేశం డిసెంబర్ 4న ప్రారంభం కాగా, ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను శుక్రవారం(డిసెంబర్ 6) ప్రకటించారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, వృద్ధిని కొనసాగించడంతోపాటు ధరలను స్థిరంగా ఉంచడమే మా లక్ష్యం అని ఆర్‌బిఐ గవర్నర్ అన్నారు. అదే సమయంలో వృద్ధిని కొనసాగించడం ముఖ్యమని, ఇది ఆర్‌బిఐ చట్టంలో కూడా ఉందన్నారు. జిడిపి వృద్ధి రేటు క్షీణతపై ఆర్‌బిఐ గవర్నర్ మాట్లాడుతూ, ఆర్థిక వృద్ధి రేటు క్షీణతకు కారణం పారిశ్రామిక ఉత్పత్తి క్షీణత. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో పారిశ్రామిక వృద్ధిరేటు 7.2 శాతం కాగా, రెండో త్రైమాసికంలో 2.1 శాతానికి తగ్గింది. తయారీ రంగం వృద్ధి రేటు తగ్గిందని ఆయన అన్నారు.
గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ పెరిగిందని, అయితే పట్టణ ప్రాంతాల్లో డిమాండ్ తగ్గుతోందని ఆర్‌బీఐ గవర్నర్ తెలిపారు. ఆర్‌బీఐ వృద్ధి రేటు అంచనాను తగ్గించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో, ఆర్‌బిఐ జిడిపి వృద్ధి రేటు 6.6 శాతంగా అంచనా వేసింది. ఇది అంతకుముందు 7.2 శాతం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో జీపీపీ వృద్ధి రేటు 6.6 శాతంగా, నాల్గవ త్రైమాసికంలో 6.8 శాతంగా ఆర్‌బీఐ అంచనా వేసింది.






## సిబిల్ స్కోర్ తగ్గిందా.. ఇలా పెంచుకోండి..!

చాలా మంది సిబిల్ స్కోర్ తగ్గిపోయి లోన్లు రాక ఇబ్బంది పడుతూ ఉంటారు. ఎలా పెంచుకోవాలో తెలియక అవస్థలు పడుతుంటారు. కానీ కొన్ని పద్ధతులు పాటించి క్రెడిట్ స్కోర్ పెంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. క్రెడిట్ కార్డును 30 శాతం కంటే తక్కువగా వినియోగించాలి. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలి. లోన్ కోసం వెంటవెంటనే అప్లై చేయకూడదు. మీ పేరుపై ఇతరులకు లోన్ తీసి ఇవ్వకూడదు.



## సమ సమాజ నిర్మాణ దార్శనికుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్

### బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా దేశానికి వారందించిన సేవలను, అనితర సాధ్యమైన కృషిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. దేశ స్వాతంత్ర్య అనంతరకాలంలో ప్రపంచానికే ఆదర్శవంతమైన స్వయంపాలన కోసం రాజ్యాంగాన్ని అందించారని తెలిపారు. ఆర్థిక సామాజిక రాజకీయ సాంస్కృతిక తదితర రంగాల్లో అణగారిన వర్గాలకు సమాన వాటా సమన్యాయం దక్కేలా రాజ్యాంగాన్ని పొందుపరచడం లో బాబాసాహెబ్ కనబరిచిన దార్శనికత మహోన్నతమైన దని కేసీఆర్ కొనియాడారు. దేశంలో రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా అంబేద్కర్ పొందుపరిచిన ఆర్టికల్ 3, ఈ దిశగా వారి దార్శనికత, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మార్గం చూపిందని గుర్తు చేశారు. వివక్షకు వ్యతిరేకంగా తన జీవితకాలం పోరాడిన అంబేద్కర్ అజరామర కీర్తిని ప్రపంచానికి చాటేందుకు తమ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. అనేక విప్లవాత్మక కార్యక్రమాలను అమలు చేసిందని తెలిపారు. అంటరాని వర్గాలుగా తర తరాలుగా వివక్షకు గురవుతున్న దళిత సమాజాన్ని ఆర్థికంగా బలోపేతం చేసి వారి సామాజిక గౌరవం ఇనుమడింప చేసే దిశగా, అంబేద్కర్ స్ఫూర్తితోనే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకం అమలు చేసిందన్నారు. దళిత జీవితాల్లో వెలుగులు నింపే దిశగా దళిత బంధు సత్ఫలితాలు సాధించిందని తెలిపారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ అన్ని రంగాల్లో వివక్ష లేని సమ సమాజ నిర్మాణానికి అవసరమైన కృషి చేయడం ద్వారానే, అంబేద్కర్ మహనీయునికి మనం ఘన నివాళి అర్పించగలమని కేసీఆర్ పేర్కొన్నారు.

## రాజ్యసభలో నగదు కలకలం.. తెలంగాణ ఎంపీ సీటు వద్ద నోట్ల కట్ట

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎగువ సభలో భారీగా నగదు పట్టుబడింది. ఎంపీ అభిషేక్ సింఘ్వీ సీటు వద్ద నోట్ల కట్ట లభ్యమైనట్లు రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ తాజాగా వెల్లడించారు.సాధారణ భద్రతా తనిఖీల్లో భాగంగా గురువారం సభ వాయిదా పడిన తర్వాత సెక్యూరిటీ సిబ్బంది తనిఖీలు నిర్వహించినట్లు చైర్మన్ తెలిపారు. ఈ తనిఖీల్లో రూ.500 నోట్లతో ఉన్న నగదు కట్టను గుర్తించినట్లు చెప్పారు. సీటు నంబర్ 222 నుంచి భద్రతా అధికారులు కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఆ సీటు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం నుంచి ఎన్నికైన ఎంపీ అభిషేక్ మను సింఘ్వీనికి కేటాయించిందిగా గుర్తించినట్లు చైర్మన్ వెల్లడించారు. ఈ అంశంపై విచారణకు ఆదేశించినట్లు ధన్‌ఖర్ వెల్లడించారు. మరోవైపు తాజా ఘటనపై కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అం శంలో సింఘ్వీ పేరును ప్రస్తావించడంపై మల్లికార్జున ఖర్గే అభ్యంతరం వ్యక్తం చేశారు.





## బెస్ట్ నగరాల లిస్ట్.. భారత్ నుంచి ఢిల్లీకి 74వ స్థానం

ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాల జాబితాను యూరోమానిటర్ సంస్థ తాజాగా విడుదల చేసింది. భారత్ నుంచి కేవలం ఢిల్లీ(74వ స్థానం) మాత్రమే అందులో చోటు దక్కించుకుంది. వరుసగా నాలుగో ఏడాది కూడా అగ్రస్థానాన్ని పారిస్ దక్కించుకుంది. రెండో ప్లేస్‌లో మాడ్రిడ్, మూడో ర్యాంకులో టోక్యో ఉన్నాయి. ఈ ర్యాంకుల్ని నిర్ణయించేందుకు మొత్తం 55 వివిధ అంశాల్ని పరిగణనలోకి తీసుకున్నట్లు యూరోమానిటర్ వివరించింది.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM




## రాహుల్, సొరోస్ ఏక్ హై:
# BJP ఎదురుదాడి

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై BJP ఎదురుదాడికి దిగింది. ఆయనను భారత వ్యతిరేకి జార్జి సొరోస్ చేతిలో కీలుబొమ్మగా వర్ణించింది. US డీప్‌స్టేట్‌తో ఆయనకు సంబంధాలు ఉన్నట్టు పేర్కొంది. ఈ కనెక్షన్లపై BJP4INDIA హ్యాండిల్లో సుదీర్ఘ ట్విటర్ థ్రెడ్స్ క్రియేట్ చేసి స్క్రీన్‌షాట్లను ఉంచింది. సొరోస్, ఓపెన్ సొసైటీ, OCCRP, డీప్ స్టేట్ ప్రతినిధులను రాహుల్ సీక్రెట్‌గా కలవడం, భారత్ జోడో యాత్రలో వారి హస్తంపై వివరించింది.

## మొదటి బంతికే వికెట్..
# జైస్వాల్ డకౌట్

అడిలైడ్‌లో జరుగుతున్న రెండో టెస్ట్‌లోనూ విజయంతో సిరీస్‌పై పట్టు సాధించాలన్న టీమ్‌ఇండియాకు ఆదిలోనే చుక్కెదురైంది. మంచి ఫామ్‌లో ఉన్న యువ బ్యాటర్ యశస్వీ జైస్వాల్ డకౌటయ్యాడు. టాస్ గెలిచిన కెప్టెన్ రోహిత్.. బ్యాటింగ్ ఎంచుకున్నాడు. దీంతో పెర్త్ టెస్ట్ విన్‌లో కీలక పాత్ర పోషించిన ఓపెనింగ్ జోడీ జైస్వాల్, రాహుల్ జంటను మళ్లీ రంగంలోకి దింపింది. అయితే తానాడిన ఫస్ట్ బాల్‌కే వికెట్ సమర్పించుకున్నాడు.





## ఏపీలో బిగ్ అప్డేట్
# 16,347 టీచర్ పోస్టులు

16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ మరింత ఆలస్యం అయ్యే అవకాశం కన్పిస్తోంది. ఎస్సీ వర్గీకరణపై ఆర్ఆర్ మిశ్రా నేతృత్వంలో నియమించిన ఏకసభ్య కమిషన్ నివేదిక వచ్చిన తర్వాతే DSC ప్రక్రియ ప్రారంభిస్తామని విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. ఈ నివేదిక ఎప్పటికి వస్తుందో తనకు తెలియదని, ఆ అంశం తన పరిధిలో లేదని చెప్పారు. కమిషన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత 60 రోజుల్లో నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది.



## జీబ్రాకి ఎండ్ కార్డ్..
# సత్యదేవ్ ఎమోషనల్ పోస్ట్

రీసెంట్ గా మన టాలీవుడ్ అందించిన మంచి హిట్ చిత్రాల్లో టాలెంటెడ్ నటుడు సత్యదేవ్ నటించిన సాలిడ్ ఫైనాన్షియల్ క్రైమ్ థ్రిల్లర్ చిత్రం "జీబ్రా" కూడా ఒకటి. దర్శకుడు కార్తిక్ తెరకెక్కించిన ఈ చిత్రం పట్టుబట్టి మరీ సత్యదేవ్ థియేట్రికల్ రిలీజ్ చేయించి హిట్ కొట్టాడు. అయితే మంచి వసూళ్లు కూడా అందుకున్న ఈ సినిమా ఇపుడు ఫైనల్ రన్ కి చేరుకుంది. మరి దీనిపై సత్యదేవ్ ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. మా జీబ్రా రన్ కి ఎండ్ కార్డ్ పడింది. థియేటర్స్ లో ఇంతపెద్ద సక్సెస్ ని ఇచ్చినందుకు అందరికీ ధన్యవాదాలు మళ్లీ ఖచ్చితంగా స్ట్రాంగ్ సినిమాతో వస్తాను అంటూ ప్రామిస్ చేసాడు. మరి లేటెస్ట్ గా పుష్ప 2 రిలీజ్ అయ్యి సెన్సేషనల్ హిట్ అండ్ బుకింగ్స్ నమోదు చేస్తున్న సంగతి తెలిసిందే. సో జీబ్రా రన్ కూడా ఆల్మోస్ట్ కంప్లీట్ చేసేసుకుంది. మొత్తానికి జీబ్రా సక్సెస్ తో ఈ రకంగా సత్యదేవ్ అనందం గానే ఎమోషనల్ అయ్యాడు.



## రేపు నల్గొండలో లక్ష మందితో
# సీఎం రేవంత్ సభ

సీఎం రేవంత్ రెడ్డి రేపు నల్గొండలో పర్యటించనున్నారు. ప్రభుత్వం ఏర్పడి రేపటికి ఏడాది కానుండటంతో జిల్లా కేంద్రంలో లక్ష మందితో సభ నిర్వహించేందుకు కాంగ్రెస్ సిద్ధమైంది. బ్రహ్మణవెల్లెంల ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటరీ ఛానళ్లు, గంధంవారిగూడెం వద్ద నిర్మించిన ప్రభుత్వ వైద్యకళాశాల తదితర అభివృద్ధి పనులను సీఎం ప్రారంభిస్తారని పార్టీ వర్గాలు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి ఆధ్వర్యంలో సభ ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## గ్రూప్-1,2,3 ఫలితాలు
# ఎప్పుడంటే?

రాష్ట్రంలో గ్రూప్-1, 3 పరీక్షలు జరగ్గా, ఈ నెలలో గ్రూప్-2 నిర్వహించనున్నారు. తొలుత గ్రూప్-1 ఫలితాలు, పోస్టుల భర్తీ.. ఆ తర్వాత గ్రూప్-2 ఫలితాలు, భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. చివర్లో గ్రూప్-3 ఫలితాలు రిలీజ్ చేస్తారని సమాచారం. ఇలా వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి అన్ని గ్రూప్ ఉద్యోగాలు భర్తీ కానున్నాయి. మెరిట్ ఉన్న నిరుద్యోగులు అవకాశాలు కోల్పోకూడదని TGPSC ఇలా కొత్త విధానం అమలు చేయనున్నట్లు సమాచారం.



## తెలంగాణలో
# 3 ఈఎస్ఐ ఆస్పత్రులు

తెలంగాణలో 3 ఈఎస్ఐ ఆస్పత్రులను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర సహాయమంత్రి శోభ కరంద్లాజే వెల్లడించారు. రామగుండం, రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో 100 పడకలు, మహబూబ్‌నగర్‌లో 100 పడకలకు ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఏడు ఆస్పత్రులు ఉన్నాయని, వాటిలో రెండు ఈఎస్ఐ కార్పొరేషన్, మిగతావి తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో సాగుతున్నాయన్నారు.


## రేపు వచ్చేది మా ప్రభుత్వమే..
# ఊరుకోం

అక్రమ అరెస్టులకు భయపడేది లేదని బీఆర్ఎస్ నేత పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. 'పాడి కౌశిక్ రెడ్డి అరెస్ట్ తీరు సరిగా లేదని మా మాజీ మంత్రులు, నేతలు ఆయన్ను కలవడానికి వెళ్లాం. చట్టాలు ఉల్లంఘించి మమ్మల్ని అరెస్ట్ చేసి అనేక స్టేషన్లు తిప్పారు. రేపు వచ్చే ప్రభుత్వం మాదే. మీ అక్రమాలు సహించం' అని పల్లా అన్నారు. నార్సింగి పీఎస్ వద్దకు భారీగా బీఆర్ఎస్ శ్రేణులు చేరుకోగా, అర్ధరాత్రి పల్లాను పోలీసులు విడుదల చేశారు.

## తెలుగు ఇండస్ట్రీలో
# నటించాలంటే కష్టం

తెలుగు చిత్రసీమలోకి వచ్చిన కొంత కాలంలోనే విజయాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు సంయుక్త. ప్రస్తుతం తెలుగుతోపాటు మలయాళ భాషల్లో వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమయ్యారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ టాలీవుడ్‌లో నటించాలంటే కష్టమన్నారు. 'మలయాళంతో పోలిస్తే తెలుగు సినిమాల్లో నటించాలంటే చాలా కష్టం. భాష రాకపోవడం ఒక కారణమైతే.. మేకప్ మరో కారణం. వినడానికి వింతగా ఉన్నా.. నా వరకు అది చాలా పెద్ద విషయం. మలయాళ సినిమాల్లో చేసేటప్పుడు మేకప్ వేసుకోవడం వెంటనే అయిపోతుంది. చాలా లైట్‌గా, సహజంగా వేస్తారు. యాక్టింగ్ చేసేటప్పుడు కూడా పూర్తి స్వేచ్ఛ ఉన్నట్లు అనిపిస్తుంది. కానీ, టాలీవుడ్‌లో స్వీయ జాగ్రత్తలు చాలా తీసుకోవాలి. తెరపై ఎలా కనిపిస్తామా.. అని ఎప్పుడూ చూసుకుంటూ ఉండాలి. ఎక్కువ మేకప్ వేస్తారు. షాట్ చేస్తున్నప్పుడు కూడా మేకప్‌ను చెక్ చేసుకోవాలి.





## కాలిఫోర్నియాలో
# భారీ భూకంపం

అమెరికాలోని ఉత్తర కాలిఫోర్నియాలో భారీ భూకంపం వచ్చింది. రిక్టర్ స్కేల్‌పై దాని తీవ్రత 7.0గా నమోదయింది. గురువారం ఉదయం 10.44 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) ఫెర్న్‌డేల్‌కు నైరుతి దిశగా 100 కిలోమీటర్ల దూరంలో కేప్ మెండోసినో తీరంలో భూమి కంపించింది. పెట్రోలియా, స్కాటియా, కాబ్ తదితర ప్రాంతాల్లోనూ భూకంపం సంభవించినట్టు అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది. ఉత్తర కాలిఫోర్నియా తీరానికి సమీపంలో భూకంప కేంద్రం 6 కిలోమీటర్ల లోతులో ఉన్నట్టు వెల్లడించింది. అమెరికా పశ్చిమ తీరంలో సునామీ హెచ్చరికలు జారీ చేశారారు. భూకంప కేంద్రం నుంచి 300 కిలోమీటర్ల తీరం పొడవునా సునామీ వచ్చే అవకాశం ఉందని హోనొలులులోని సునామీ హెచ్చరికల కేంద్రం హెచ్చరించింది. అయితే కాసేపటికి హెచ్చరికలను ఉపసంహరించుకున్నది. కాగా, భూ ప్రకంపనలు శాన్‌ఫ్రాన్సిస్కో వరకు వ్యాపించాయి. కొన్ని సెకన్ల పాటు భూమి కంపించినట్లు ప్రజలు తెలిపారు. శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియా రాపిడ్ ట్రాన్సిట్ ముందుజాగ్రత్తగా నీటి అడుగున సొరంగం నుంచి ట్రాఫిక్‌ను నిలిపివేసింది. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు.



## ఢిల్లీలో మెరుగుపడిన
# గాలి నాణ్యత

దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత మెరుగుపడింది. ఇటీవలే రాజధాని ప్రాంతంలో గాలి కాలుష్యం తీవ్ర స్థాయికి చేరిన విషయం తెలిసిందే. ఒకానొక సమయంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఏకంగా 500 మార్క్‌ను దాటింది. దీంతో కాలుష్య నియంత్రణకు గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్-4 నిబంధనలు విధించారు. ఈ నిబంధనలు కాస్త సత్ఫలితాలనిచ్చాయి. ప్రస్తుతం రాజధానిలో గాలి నాణ్యత చాలా వరకూ మెరుగుపడింది. శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో గాలి నాణ్యత మోడరేట్ కేటగిరీలో నమోదైంది. ఏక్యూఐ లెవల్స్ 183గా నమోదైంది.ప్రస్తుతం ఢిల్లీ — ఎన్‌సీఆర్ పరిధిలో వాయుకాలుష్యం మెరుగుపడటంతో ఆంక్షలు సడలించారు. కాలుష్యాన్ని అరికట్టేందుకు తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు గురువారం విచారణ చేటప్టింది. కాలుష్యం మెరుగుపడటంతో జీఆర్ఏపీ-4 ఆంక్షల సడలింపునకు అనుమతి ఇచ్చింది. సుప్రీం అనుమతితో రాజధానిలో శుక్రవారం నుంచి పాఠశాలలు తెరచుకున్నాయి. ఢిల్లీ — ఎన్‌సీఆర్ ప్రాంతంలో పాఠశాలలను పునఃప్రారంభిస్తున్నట్లు ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.